హనుమంతుడికి ప్రత్యేక పూజలు

దత్తాత్రేయ దేవాలయంలో హనుమంతుడికి పూజలు చేస్తున్న భక్తులు

రామాయంపేట, జూన్ 4 : రామాయంపేట పట్టణంలోని దత్తాత్రేయ దేవాలయంలో మంగళవవారం హనుమంతుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని రాంనగర్ కాలనీవాసులు ఆలయానికి చేరుకొని స్వామివారికి మంగళహారతులు, నైవేద్యాలను సమర్పించారు. ఆలయ పూజారి కూర్మాచలం శ్రీనువాసచారి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

108 సేవలను వినియోగించుకోవాలి

పెద్దశంకరంపేటలో 108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా పోగ్రాం అధికారి జనార్దన్

పెద్దశంకరంపేట, జూన్ 4 : మెదక్ జిల్లాలో తెలంగాణ ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న 109,102 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా 108, 102 పోగ్రాం ఆఫీసర్ జనార్దన్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎక్కడ ప్రమాదం జరిగినా 108 సిబ్బంది వెంటనే స్పందించాలన్నారు. గర్భిణులు, బాలింతలు 102 వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్దశంకరంపేటలో 108 సిబ్బంది అందజేస్తున్న సేవలను చూసి వారిని అభినందించారు. ఈఎంఈ అధికారి మహేశ్, పైలట్ రమేశ్, సంగమేశ్, సుధాకర్, తదితరులు ఉన్నారు.

వరికొయ్యలు కాల్చితే నష్టం

- భూసారం దెబ్బతినే ప్రమాదం ఎక్కువ

గజ్వేల్, జూన్ 4 : అన్నదాతలు పూర్వం వరిచేళ్లను కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారు. అంతే కాకుండా అప్పటి రోజుల్లో పశువులు ఎక్కువగా.. వరిసాగు తక్కువగా ఉండటంతో పశుగ్రాసం కుప్పలు కుప్పలుగా పెట్టుకునేవారు. ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు వచ్చాయి. యంత్రాలను విరివిగా ఉపయోగిస్తుండటంతో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గింది. మిషన్‌తో హార్వెస్టింగ్ చేసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. ప్రస్తుతం అంతటా వరికోతలు పూర్తయ్యాయి. రైతులు ఎంతో కొంత గడ్డిని తెచ్చుకోవడం, మిగిలిన దానిని అక్కడే వదిలివేస్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలతో పాటు గడ్డిని కాలబెడుతున్నారు. దీనివల్ల అధిక నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ వరికొయ్యలను తగులబెట్ట కూడదని వ్యవసాయ నిపుణులు, వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు చాలామంది వరినాటు వేసే సమయంలో మొదటి దఫా దున్నుడుకు, రెండో దఫా దున్నుడుకు మధ్య నాలుగు నుంచి ఐదురోజుల సమయం మాత్రమే తీసుకుంటారు. దీనివల్ల కొయ్యకాలు, గడ్డి త్వరగా కుళ్లిపోవు. ఇలాంటి సమయంలో పశువులను అందులో వదిలితే అటూ తిరుగడం, పొలంలో పేడ, మూత్ర విసర్జన చేయడం ద్వారా త్వరగా కుళ్లి భూసారం పెరుగుతుంది. పంట దిగుబడి 5 శాతం పెరుగుతుంది. లేదంటే అందులోనే కలియదున్ని కనీసం ఎనిమిది రోజుల సమయం తీసుకుని రెండు దఫా దున్నాలి. వీలైతే మొదటి దఫాలో ఒక్కసారి రోటోవేటర్‌తో దున్నితే గడ్డి, కొయ్యకాలు చిన్నచిన్న ముక్కలుగా విడిపోయి తరువాత దున్నినప్పుడు ఎలాంటి సమస్య ఉండదు. దున్నే ముందు ఎకరానికి క్వింటాల్ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే కొయ్యలు, గడ్డి త్వరగా కుళ్లిపోతాయి. జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు వేసి ఏపుగా పెరిగిన తర్వాత కలియదున్నితే భూమి సారవంతంగా మారుతుందని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

కొయ్యలు కాల్చటం భూమికి తీవ్ర నష్టం

రైతులు వరికొయ్యలు కాల్చటం ద్వారా భూసారం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముంది. మంటల ద్వారా విపరీతమైన వేడితో భూసారాన్ని కోల్పోతుంది. ముఖ్యం గా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం అధికంగా ఉంది. ప్రస్తుతం వర్షాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నందున ఈ విషయాన్ని తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు అగ్నికి బుగ్గవుతుంటంతో పర్యావరణానికి తీరని హాని కలుగుతుంది. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాల దగ్గరే ఉన్న ధాన్యం కాలిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

కలియ దున్నితే ప్రయోజనం

వరికొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశముంది. దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుంది.

సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది

ప్రస్తుతం రైతులు వర్షాకాలం పంట సాగులో భాగంగా వేసిన వరిపంట చేతికొచ్చినందున వరిపంటలు కోసే పనులు పూర్తయ్యాయి. కోతల అనంతరం పొలాలను సిద్ధం చేసుకునే రైతులు తమ వ్యవసాయ పొలాల్లోని వరికొయ్యలను తగులబెట్టకుండా భూమిని కలియదున్నాలి. దీని ద్వారా సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. వరికొయ్యకాలకు నిప్పు పెట్టడం వల్ల గాలి, నేల కలుషితమవుతుంది. రసాయన ఎరువుల వాడకం పూర్తిగా తగ్గించవచ్చు.

– నాగరాజు,
వ్యవసాయాధికారి, గజ్వేల్

ఫలితాలను వెల్లడిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఉత్కంఠకు తెర

- మెదక్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ పూర్తి
- ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు
- కౌంటింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేసిన అధికార యంత్రాంగం

నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాలలో ఓట్ల లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

మెదక్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఉత్కంఠకు తెరపడింది. కౌంటింగ్ ప్రక్రియను అధికార యంత్రాంగం పకడ్బందీగా పూర్తి చేసింది. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు చేపట్టింది. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియను నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాలలో ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, దుబ్బాక, గజ్వేల్ సెగ్మెంట్ల పరిధిలోని ఓట్లను లెక్కించగా, గిరిజన బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల గ్రౌండ్ ఫ్లోర్‌లో సంగారెడ్డి, మొదటి అంతస్తులో పటాన్‌చెరు ఓట్లను లెక్కించారు. ఓట్ల లెక్కింపు అనంతరం అభ్యర్థులకు సంబంధించిన ఫలితాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులు తెలియజేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 103 టేబుళ్లు ఏర్పాటు చేయగా, 147 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది.

నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాలలో పాల్గొన్న సిబ్బంది

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా 23 రౌండ్లలో పోలైన ఓట్లను వెల్లడించారు.

మెదక్ నియోజకవర్గంలో..

మెదక్ నియోజకవర్గంలో 277 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 2,16,748 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,03,654 మంది కాగా, మహిళలు 1,13,089 మంది ఉన్నారు. ఇందులో 1,75,409 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. నర్సాపూర్ బీవీఆర్ఐటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేయగా, 20 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 55,588 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 67,374 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 40,776 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 14,315 కాగా, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు 4179 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 7,440 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 1540 ఓట్లు వచ్చాయి. చెల్లని పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 307 కాగా, 665 ఓట్లు రిజక్ట్ అయ్యాయి.

నర్సాపూర్ నియోజకవర్గంలో

నర్సాపూర్, జూన్ 4 : మెదక్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో మంగళవారం జరిగాయి. నర్సాపూర్ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధుదేపై చేయిగా నిలిచింది. నర్సాపూర్ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి నీలం మధుకు 72,376 ఓట్లు, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు 51,811 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామి రెడ్డికి 54,372 ఓట్లు పోలయ్యాయి. మొదటి స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నిలవగా రెండో స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి, మూడో స్థానంలో బీజేపీ అభ్యర్థి నిలిచారు. బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 18,004 ఓట్ల మెజార్టీ వచ్చింది. నర్సాపూర్ మున్సిపాలిటీలో మాత్రం బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు సత్తా చాటారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి 3916, బీజేపీ పార్టీకి 4251, బీఆర్ఎస్ అభ్యర్థికి 2089 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీపై బీజేపీ పార్టీ 335 ఓట్ల ఆధిక్యం సాధించారు. నర్సాపూర్ శాసనసభ ఎన్నికల్లో కంటే మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పుంజుకుందని చెప్పవచ్చు. నర్సాపూర్ నియోజకవర్గ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 78,957, బీజేపీ పార్టీకి 22,713, బీఆర్ఎస్ పార్టీకి 88104 ఓట్లు పోలయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం బీఆర్ఎస్ పార్టీ కంటే కాంగ్రెస్ పార్టీ 15,728 ఓట్ల ఆధిక్యం సాధించింది.

ధ్రువీకరణ పత్రం అందజేత

నర్సాపూర్,జూన్4 : మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విజయం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ ఎంపీగా గెలుపొందిన రఘునందన్‌రావుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని వెల్లడించారు. బీజేపీ నాయకులు మురళీయాదవ్, మల్లేశ్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ బీవీఆర్ఐటీలో సంతకం చేస్తున్న బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు

నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు ప్రారంభిస్తున్న సిబ్బంది

కళాశాల ఎదుట బందోబస్తు చేస్తున్న పోలీస్ సిబ్బంది

అటకెక్కిన న్యూట్రీషన్ కిట్లు!

- గర్భిణులకు మొండిచేయి చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- పోషకాహారం అందక ఇబ్బందులు పడుతున్న గర్భిణులు...
- పట్టించుకోని ప్రభుత్వం.. కిట్లు పంపిణీ చేయాలని గర్భిణుల డిమాండ్
- మెదక్ జిల్లాలో ఆరు నెలలుగా నిలిచిన కిట్ల పంపిణీ

న్యూట్రీషన్ కిట్లు

మెదక్, జూన్ 4 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది గర్భిణులకు న్యూట్రీషన్ కిట్ల పంపణీని ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత న్యూట్రీషన్ కిట్లు అడ్రస్ లేకుండాపోయాయి. గర్భిణులను పోషకాహార లోపం, రక్త హీనత నుంచి కాపాడేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం న్యూట్రీషన్ కిట్ పథకానికి గతంలో రూపకల్పన చేసింది. ఈ కిట్‌లో 8 రకాల వస్తువులు ఉంటాయి. కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, కిలో ఖర్జూరం, మూడు ఐరన్ సిరప్ బాటిళ్లు, అరకిలో నెయ్యి, 200 గ్రాముల పల్లిపట్టి, ఒక కప్పు, ప్లాస్టిక్ బాటిల్ ఉంటాయి. ప్రతి గర్భిణికి రెండు కిట్లు అందజేసేవారు. 13–27 వారాల మధ్య జరిగే రెండో ఎఎన్‌సీ చెకప్ సమయంలో ఒకసారి, 28–34 వారాల మధ్య నిర్వహించే మూడో ఏఎన్‌సీ చెకప్ సమయంలో రెండోసారి ఈ కిట్‌ను ఇచ్చేవారు. స్తారు. ఒక్కో కిట్ విలువ సుమారు రూ.2 వేలు ఉంటుంది.

పోషకాహారం అందక ఇబ్బందులు పడుతున్న గర్భిణులు..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో న్యూట్రీషన్ కిట్ల పంపిణీ ఎక్కడా కూడా ఆగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కిట్ల పంపిణీ ఆగిపోయింది. మెదక్ జిల్లా లో 3వేల మందికి కిట్లు అందాల్సి ఉంది. మెదక్ జిల్లాలో 20 పీహెచ్‌సీలు, ఒక జిల్లా కేంద్ర దవాఖాన, రెండు సీహెచ్‌సీలు ఉన్నాయి. వాటి పరిధిలో 13 నుంచి 27 వారాల గర్భిణులకు మొదటి కిట్, 28 నుంచి 34 వారాల గర్భిణులకు రెండో కిట్ అందింది. ఇకపోతే నాలుగో గర్భిణులు ప్రస్తుతం ఎనిమిదో నెలకు వచ్చారు. ప్రస్తుతం వారికి కిట్లు అందాల్సి ఉంది. అంతే కాదు కొత్తగా గర్భం దాల్చిన వారికి కూడా కిట్లు అందాల్సి ఉంది. దీంతో గర్భిణులు పోషకాహారం అందక ఇబ్బంది పడుతున్నారు.

ఆరు నెలలుగా ఆగిపోయిన న్యూట్రీషన్ కిట్లు..

ప్రస్తుతం మెదక్ జిల్లాలో న్యూట్రీషన్ కిట్ల పంపిణీ నిలిచిపోయింది. గతంలో కొనుగోలు చేసిన కిట్ల నిల్వలు అయిపోయాయి. కొత్తగా కొనుగోళ్లపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదని అధికారులు చెబుతున్నారు. పథకాన్ని నిలిపివేస్తారో, కొత్త పేరుతో కొనసాగిస్తారో తెలియడం లేదని అంటున్నారు. దీంతో వేలమంది గర్భిణులకు కిట్ల పంపిణీ ఆగిపోయిందని చెబుతున్నారు. ప్రభు త్వం వెంటనే స్పందించి కిట్ల కొనుగోలుకు చొరవ చూపాలని కోరుతున్నారు. ప్రతి గర్భిణికి నాలుగో నెలలో ఒకసారి, ఎనిమిదో నెలలో ఒకసారి గత కేసీఆర్ ప్రభుత్వం న్యూట్రీషన్ కిట్ అందించేది. అందిన కిట్లను సద్వినియోగం చేసుకొని గర్భిణులు ఆరోగ్యాన్ని కాపాడుకునేవారు. ఒక్కో కిట్‌లో కిలో ప్రొటీ న్ పౌడర్, కిలో ఖర్జూర, మూడు ఐరన్ సిరప్స్ , బెల్లం పల్లీ పట్టీతో ఇతర పదార్థాలు ఉండేవి.

కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందు ప్రతి గర్భిణికి కిట్లు అందాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పైనుంచే సరఫరా ఆగిపోయింది. గర్భిణులు దవాఖానకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాత వైద్యాధికారులను న్యూట్రీషన్ కిట్ ఇవ్వాలని అడిగితే వాటి పంపిణీ నిలిపివేశారని సమాధానం చెప్పడంతో నిరాశతోనే వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు ప్రభుత్వంపై దృష్టికి తెచ్చి గర్భిణులకు కిట్లు పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

పిడుగు పాటుతో యువకుడు మృతి

మృతి చెందిన జైపాల్

పెద్దశంకరంపేట, జూన్ 4 : పెద్దశంకరంపేట మండలం భూర్గుపల్లి చందా నాయక్ తండాకు చెందిన మూడ జైపాల్ (25)మంగళవారం మేకలు కాయడానికి వెళ్లడంతో ఒక్కసారిగా పిడుగు పడటంతో జైపాల్‌తో పాటు మూడుమేకలు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. జైపాల్ ప్రతి రోజు మేకలను కాస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా, మృతుడి భార్య గర్భవతి కావడంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కోరారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

పరిస్థితి విషమించి యువకుడి మృతి

చిన్నశంకరంపేట, జూన్ 4 : చేయడానికి పని దొరకక మద్యానికి బానిసై పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధి గవ్వలపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పవన్‌కల్యాణ్(19) బ్యాండ్ కోరుతూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. తండ్రి నర్సింహులు గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. కొంత కాలంగా పని దొరకక పోవడంతో మద్యానికి బానిసైన పవన్ కల్యాణ్ గత నెల మే 11న పురుగు మందును తాగి ఇంటి ముందు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు గమనించిన తల్లి నర్సమ్మ, కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీకి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం చికిత్స పొందుతూ పవన్‌కల్యాణ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా అక్రమ ఇసుక దందా..

ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 4: మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని ప్రధాన వాగుల నుంచి కొన్నిరోజులుగా కొంతమంది అక్రమంగా ఇసుక దందా కొనసాగిస్తున్నారు. పట్టపగలే ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తుండంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధూళిమిట్ట, మద్దూరు, బైరాన్‌పల్లి, జాలపల్లి గ్రామాల వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా అనుమతులు లేకుండా వివిధ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ఇసుక ట్రాక్టర్‌కు రూ. 5 నుంచి 8వేల వరకు వసూలు చేస్తున్నారు. కమలాయపల్లిలో ఏకంగా చెరువులోనే అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. చెరువులు, వాగుల నుంచి అక్రమంగా తీసిన ఇసుకను కొంతమంది తమ వ్యవసాయ బావుల వద్ద డంపులు చేసుకొని దశలవారీగా అమ్ముకుంటున్నారు. మండలంలో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై కొన్ని రోజులుగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేకంగా దాడులు చేస్తున్నప్పటికీ ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ ఇసుక దందాను అరికట్టాలని, లేని పక్షంలో వాగులన్నీ వట్టిపోయి భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రమజీవుల వెతుకులాట

కాసిన్ని దొరికినా అదే పదివేలు అనుకుంటూ ఆశలతో ఇలా శ్రమిస్తున్నారు కార్మికులు. హుస్నాబాద్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారు. ఈ సందర్భంగా దుకాణాల ఎదురుగా ఉన్న గద్దెలు, మెట్లు కూల్చివేశారు. ఇలా కూల్చివేసిన వాటిలో ఏదైనా ఇనుప వస్తువులు దొరుకుతాయోనని సిమెంట్ దిమ్మెలను పగులగొట్టి కార్మికులు వెతుకులాడుతున్నారు.

-హుస్నాబాద్‌టౌన్, జూన్ 4

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.